# ఇండియన్ పాలిటీ

## ప్రాథమిక హక్కులు - సమానత్వపు హక్కు

**'హక్కు' అంటే పొంది ఉండటం/ కలిగి ఉండటం. అలా పొంది ఉన్నదాన్ని మనిషి ప్రకటించుకోగలగాలి, సమాజం గుర్తించగలగాలి, రాజ్యం అమలు చేయగలగాలి. అప్పుడే హక్కులకు పరిపూర్ణత ఏర్పడుతుంది. హక్కులు ఒక సామాజిక భావన. మనుషుల సామాజిక, రాజకీయ జీవనానికి ఇవి ఎంతో అవసరం. హక్కులను అమలు చేసే వాతావరణం కేవలం నేటి ఆధునిక, ప్రజాస్వామ్య, ఉదారవాద రాజ్యాల్లో మాత్రమే సాధ్యం.**

ఒక రాజ్యం లక్షణం, స్వభావం అది పౌరులకు కల్పించే హక్కులను బట్టి తెలుస్తుంది *(A State is known by the rights it maintains).* **- H.J. Laski.**

హక్కుల్లో విశిష్టమైనవి ప్రాథమిక హక్కులు. ఇవి పౌరుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు ప్రతిబింబాలు. రాజ్యవ్యవస్థ, ఇతర వ్యక్తుల, సమూహాల ఆధిపత్యం నుంచి వ్యక్తిని కాపాడి, అతడికి గౌరవాన్ని చేకూరుస్తాయి. పౌరుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలోని IIIవ భాగంలో (12వ అధికరణ నుంచి 35వ అధికరణం వరకు) పేర్కొన్నారు. IIIవ భాగంలో వీటిని పెట్టడం ద్వారా ప్రాథమిక హక్కులకు న్యాయస్థానాల రక్షణ కల్పించారు. వ్యక్తి స్వతంత్ర్యానికి, సర్వతోముఖాభివృద్ధికి ప్రాథమిక హక్కులు ప్రాణవాయువు లాంటివి.

### జాతీయోద్యమం - ప్రాథమిక హక్కు

1895లో బాలగంగాధర్ తిలక్ స్వరాజ్య బిల్లును ప్రతిపాదించారు. ఆ బిల్లులో భారతీయులకు వాక్ స్వాతంత్ర్యం ప్రసాదిస్తూ ప్రజల ఇళ్లకు, ఆస్తికి రక్షణ కల్పించి, చట్టరీత్యా సమానత్వాన్ని నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు. 1917 నుంచి 1919 వరకు జరిగిన కాంగ్రెస్ సభలు పౌర హక్కుల కోసం తీర్మానం చేశాయి. అయితే 1919లో బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించిన మాంటెగ్ ఛెమ్స్‌ఫర్డ్ చట్టం భారతీయులకు హక్కుల విషయంలో తీవ్ర నిరాశను మిగిల్చింది. అయితే అంతకు ముందు ఉడ్రో విల్సన్ ప్రతిపాదించిన 'జాతుల స్వయం నిర్ణయాధికారం' (National Self-determination) మన దేశంతో సహా అనేక వలస దేశాల ప్రజల హక్కులకు ఊపిరిలూదింది.

★ 1927లో జరిగిన మద్రాస్ జాతీయ కాంగ్రెస్ మహాసభ భారతీయులు రచించబోయే రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ఒక పునాది కావాలని ఆకాంక్షించింది.

★ 1928లో వెలువడిన మోతీలాల్ నెహ్రూ నివేదిక ప్రజల హక్కులకు రాజ్యాంగ రక్షణ కావాలని అభిప్రాయపడింది.

★ 1931లో జరిగిన కరాచీ కాంగ్రెస్ మహాసభ రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు ఆర్థిక స్వాతంత్ర్యం పొందేందుకు ప్రాథమిక హక్కుల తీర్మానాన్ని ఆమోదించింది.

★ 1932లో రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన గాంధీజీ భారతదేశంలో అన్ని వర్గాలు, జాతుల ప్రజలకు తమ మతం, భాష, లిపి, ఆచార సంప్రదాయాలు, సంస్కృతి లాంటి వాటిని ఎలాంటి భయం, అనుమానాలు లేకుండా స్వేచ్ఛగా అనుసరించేందుకు రాజ్యాంగ రక్షణ కావాలని కోరారు.

### రాజ్యాంగ పరిషత్ - ప్రాథమిక హక్కు

కేబినెట్ మిషన్ ప్లాన్ ఆధారంగా ఏర్పాటైన రాజ్యాంగ పరిషత్‌లో అన్ని వర్గాల ప్రజల హక్కులకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో ప్రాథమిక హక్కులు, మైనారిటీ హక్కుల కోసం ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రాథమిక హక్కుల ఉపసంఘానికి ఆచార్య కృపలానీ నేతృత్వం వహించారు.

★ రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన 'రాజ్యాంగ లక్ష్యాల తీర్మానం' (Objectives resolution of the Constitution) ఈ ఉపసంఘానికి ఒక దీపస్తంభంగా పనిచేసిందని చెప్పొచ్చు.

★ ప్రాథమిక హక్కులకు సంబంధించి మన రాజ్యాంగ నిర్మాతలు అమెరికా రాజ్యాంగంలోని బిల్ ఆఫ్ రైట్స్ నుంచి స్ఫూర్తి పొందారు. రాజ్యాంగం రాసేటప్పుడు ఏడు రకాల ప్రాథమిక హక్కులకు చోటు కల్పించారు.

## ప్రాథమిక హక్కులు

1. సమానత్వపు హక్కు (14 నుంచి 18వ అధికరణం)
2. స్వేచ్ఛ హక్కు (19 నుంచి 22వ అధికరణం)
3. పీడనాన్ని నిరోధించే హక్కు (23, 24 అధికరణాలు)
4. మత స్వాతంత్ర్యపు హక్కు (25 నుంచి 28 అధికరణం)
5. సాంస్కృతిక, విద్యా హక్కు (29, 30వ అధికరణాలు)
6. ఆస్తి హక్కు (31వ అధికరణం)
7. రాజ్యాంగ పరిహార హక్కు (32వ అధికరణం)

★ 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. కాబట్టి ప్రస్తుతం ఆరు రకాల ప్రాథమిక హక్కులున్నాయి.

## సమానత్వ హక్కు (14వ అధికరణం నుంచి 18వ అధికరణం వరకు)

**14వ అధికరణం:** ఈ అధికరణం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. (భారత భూభాగ పరిధిలో చట్టం ముందు అందరూ సమానులే. చట్టం నుంచి ప్రజలందరికీ సమాన రక్షణ లభిస్తుంది). ఈ సమన్యాయ సిద్ధాంతాన్ని ఇంగ్లండ్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. రాజనీతి శాస్త్రజ్ఞుడైన ఎ.వి.డైసీ సమన్యాయ సిద్ధాంతాన్ని వివరణాత్మకంగా పేర్కొన్నారు.

ఇదే అధికరణంలో చట్టం నుంచి సమాన రక్షణ అనే ఇంకో అంశం కూడా ఇమిడి ఉంది. అంటే సమానమైన పరిస్థితుల్లో మాత్రమే చట్టం సమానంగా వర్తిస్తుంది. ఈ అంశాన్ని అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

**15వ అధికరణం:** ఈ అధికరణం ప్రకారం ప్రజల మధ్య జాతి, కుల, మత, లింగ, జన్మ సంబంధమైన అయిదు రకాల వివక్షలను నిషేధించారు.

★ 15(2) ప్రకారం హోటళ్లు, దుకాణాలు, చెరువులు, బావులు, రోడ్లు, రైళ్లు మొదలైన ప్రజోపయోగ ప్రదేశాల్లో ఎవరిపట్లా ఎలాంటి వివక్ష చూపకూడదు.

★ పై అధికరణం బలహీన వర్గాల కోసం ప్రభుత్వం కల్పించే ప్రత్యేక సదుపాయాలకు ఎలాంటి అభ్యంతరం తెలపదు.

**16వ అధికరణం:** 16వ అధికరణం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో మత, జాతి, కుల, లింగ, వంశం, జన్మస్థలం, నివాస స్థానం లాంటి వివక్షను రాజ్యం చూపకూడదు. అయితే ఈ విషయంలో అవసరమైన వెసులుబాట్లు చేసుకునేందుకు రాజ్యాంగం పార్లమెంట్‌కు అవకాశం ఇచ్చింది.

★ 16(4) ప్రకారం వెనుకబడిన వర్గాలకు చెందినవారికి ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారు.

★ 1979లో అప్పటి మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం బి.పి.మండల్ నేతృత్వంలో ఒక కమిషన్‌ను నియమించింది (మండల్ కమిషన్). ఈ కమిషన్ ఎస్సీ, ఎస్టీలు కాక దేశ జనాభాలో 52% ఉన్న అనేక వెనుకబడిన (OBC) కులాలకు ఉద్యోగావకాశాల్లో 27% రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేసింది. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు పై అభిప్రాయానికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

★ ప్రస్తుతం 77వ రాజ్యాంగ సవరణను (1995) అనుసరించి పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారు.

**17వ అధికరణం:** ఈ అధికరణం అంటరానితనాన్ని నిషేధిస్తుంది. "కులతత్వం సంఘానికి కీడు తెస్తుంది. అంటరానితనాన్ని పెంచి పోషించడమే హిందూ ధర్మం మౌలిక లక్షణమైతే అలాంటి ధర్మం మరణించినా నాకు సమ్మతమే" అన్నారు గాంధీజీ. కాబట్టి హిందూ సమాజంలో ఉన్న ఈ రుగ్మతను తొలగించేందుకు అంటరానితనం పాటించడాన్ని ఒక నేరంగా మన రాజ్యాంగం పరిగణిస్తుంది. ఈ అధికరణాన్ని అనుసరించి పార్లమెంట్ 1955లో అస్పృశ్యత నివారణా చట్టాన్ని (1976లో ఈ చట్టం పేరును పౌరహక్కుల రక్షణ చట్టంగా మార్చారు) రూపొందించారు. కేవలం పుట్టుకను బట్టి కొందరిని అస్పృశ్యులుగా భావించే ఒక అమానవీయ ఆచారానికి స్వస్తి పలకడం ఈ అధికరణం ముఖ్య ఉద్దేశం.

**18వ అధికరణం:** 18వ అధికరణం బిరుదులను నిషేధిస్తుంది. ఈ అధికరణం ప్రకారం మిలటరీ లేదా విద్వత్ (Academic) సంబంధమైనవి తప్ప ఇతర బిరుదులను ప్రభుత్వం ఎవరికీ ప్రదానం చెయ్యకూడదు.

★ విదేశాలు ఇచ్చే బిరుదులను భారత పౌరులు స్వీకరించకూడదు.

★ ఒక వ్యక్తి భారతీయుడు కాకపోవచ్చు. అయినా భారత ప్రభుత్వం పరిధిలో ఏదైనా హోదా కలిగి ఉంటే భారత ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ ప్రభుత్వం నుంచి ఎలాంటి బిరుదు స్వీకరించకూడదు.

★ భారత ప్రభుత్వం పరిధిలో ఏదైనా హోదా కలిగి ఉన్న వ్యక్తి రాష్ట్రపతి అనుమతి లేనిదే విదేశీ ప్రభుత్వం నుంచి ఎలాంటి బహుమతులను స్వీకరించకూడదు.

★ స్వాతంత్ర్యానికి పూర్వం మహారాజ్, రాజ్‌బహదూర్, రాయ్ బహదూర్, దివాన్ బహదూర్ లాంటి వంశ పారంపర్య బిరుదులుండేవి. వాటన్నింటినీ ఈ అధికరణం రద్దు చేస్తుంది.

★ 1996లో బాలాజీ రాఘవన్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా వివాదంలో భారతరత్న, పద్మ పురస్కారాలు రాజ్యాంగబద్ధమైనవని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఇలాంటి పురస్కారాలను బిరుదులుగా వాడకూడదు.

## మాదిరి ప్రశ్నలు

**1.** ప్రాథమిక హక్కులు రాజ్యాంగంలోని ఏ భాగంలో ఉన్నాయి?

ఎ) III  బి) II  సి) IV  డి) V

**2.** రాజ్యాంగ పరిషత్‌లో ప్రాథమిక హక్కుల ఉపసంఘానికి అధ్యక్షుడు ఎవరు?

ఎ) బి.ఆర్. అంబేద్కర్  బి) సర్దార్ వల్లభాయ్ పటేల్

సి) జె.బి. కృపలానీ  డి) కె.ఎం. మున్షీ

**3.** రాజ్యాంగ పరిషత్‌లో 'రాజ్యాంగ లక్ష్యాల తీర్మానం' ప్రవేశపెట్టిందెవరు?

ఎ) బి.ఆర్. అంబేద్కర్  బి) జవహర్‌లాల్ నెహ్రూ

సి) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్  డి) సర్దార్ వల్లభాయ్ పటేల్

**4.** ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు?

ఎ) 42  బి) 44  సి) 45  డి) 10

**5.** 'చట్టం ముందు అందరూ సమానులే' అనే భావన కల్పిస్తున్న అధికరణం?

ఎ) 14  బి) 15  సి) 16  డి) 17

**6.** అంటరానితనాన్ని నిషేధిస్తున్న అధికరణం ఏది?

ఎ) 15  బి) 16  సి) 18  డి) 17

**7.** మండల్ కమిషన్ వివాదంగా దేన్ని పిలుస్తారు?

ఎ) గోలక్‌నాథ్ కేసు  బి) కేశవానంద భారతి కేసు

సి) మినర్వామిల్స్ కేసు  డి) ఇంద్రా సాహ్ని కేసు

**8.** బిరుదులను నిషేధిస్తున్న అధికరణం?

ఎ) 18  బి) 17  సి) 19  డి) 15

## జవాబులు

1-ఎ; 2-సి; 3-బి; 4-బి; 5-ఎ; 6-డి; 7-డి; 8-ఎ.

**రచయిత: జి. కళ్యాణ చక్రవర్తి**